ఆంధ్రప్రభ దినపత్రిక (3.10.76) ఆదివారం అనుబంధం

# స్వర్గం నరకం

"నేనీ పని చెయ్యలేను!"

"....."

"నీకున్న అవకాశం ఉంటే ఈ పాటికి నేనే ఆ పని చేద్దును...."

"దైవ ద్రోహం...."

"పిచ్చివాడా! మమ్మల్ని పుట్టించినవాడే నిన్నూ పుట్టించాడు! నువ్వెలా బతకవలసి ఉందో ఎప్పుడో నిర్ణయించి ఉంటాడు. ఇంక ఇది చెయ్యకూడదు, ఇది చెయ్యచ్చు అన్న మీమాంస నీకనవసరం. నిన్ను బతుకు తెరువు చూసుకోవద్దని ఏ దేవుడూ చెప్పడు."

"ఉహూఁ! తెల్లారేసరికి గుళ్ళో దేవుడు మాయమైతే ప్రజలంతా హాహాకారాలు చేసేస్తారు!"

"ఆ దేవుడే ఎవడి బుర్రలోనే ఏదో ఒక ఉపాయం పుట్టిస్తాడు. దేవుడు లేకుండా దేవాలయాన్ని అలాగే ఉంచరు. అంతా కూడగట్టుకుంటారు. మరో విగ్రహాన్ని ప్రతిష్ఠించు కుంటారు. ముందు నీ గురించి నువ్వు ఆలోచించుకో!"

"గురు ద్రోహం...."

"ఎవరా గురువు? పూజారిగారేనా! ఆయన చేతికింద ఇన్నేళ్ళనించి పని చేస్తున్నావు. దక్షిణ డబ్బులు విదపడం తప్ప..... నీకెప్పుడయినా పెద్ద మొత్తాలు ముట్టాయా? ఇలా ఎంతకాలం బండ చాకిరీ చేస్తావు? ఒక్క రాత్రి.... కష్టపడు.... ఒక్క గంట శ్రమ పడు.... ఒకటి కాదు, రెండు కాదు, పదివేలు! నీ బతుకంతా కష్టపడినా అంత డబ్బు ఒక్కసారి చూడలేవు.... ఆలోచించు మరి!"

"లాభం లేదు...."

"నువ్వు వినకపోతే నీకే లాభం లేదు.... ఆ విగ్రహం ఎలాగూ గుడి విడిచి వెళ్ళిపోవటం ఖాయం. నువ్వు వినకపోతే మా వాళ్ళు మరో మార్గం ఎలాగూ చూస్తారు. నువ్వూ ఓ చెయ్యి వేశావా, దాంట్లో వాటా ఉంటుంది. లేకపోతే...."

"అంత పని చెయ్యకండి. మహా పాపం...."

"వెర్రివాడా! వేలు వచ్చి ఒళ్ళో వాలుతుంటే ఇంకా పాపం పాపం అంటూ కూర్చుంటా వేమిటి? కావాలంటే, తరువాత ఆ డబ్బులో కొంత ఖర్చు పెట్టి శాంతి చేయించుకో!"

"తప్పు లేదంటావా?"

"లేదు... బతుకు తెరువు చూసుకోవటంలో తప్పులేదు".

"తరువాత పట్టుపడితే పోలీసులు ప్రాణాలు తోడేస్తారు."

"నీకా భయం అక్కర్లేదు... నిన్ను ఎవరికి దొరకని చోటుకి చేర్చే భారం మాది."

"మరి, మరి...."

"ఇంకే సందేహాలు పెట్టుకోకు! ఊఁ అను."

"మరి మీ వాళ్ళెప్పుడు వస్తారు?"

".... నీదే ఆలస్యం! ఈ రాత్రికే రప్పిస్తాను."

"సరే, రాత్రి పదిగంటలకి గుడి వెనుక ప్రహరీ దగ్గర ఉండండి...."

"మరో గంట ఆగితే మంచిదేమో!"

"మా గురువుగారికి అనుమానం కలగకూడదంటే ముందయితేనే మంచిది!"

"మంచిది..... బుర్ర ఉన్నవాడివే!"

● ● ●

"ఇంత రాత్రివేళ గుడికి ఎందుకు, నాయనా!"

'ఏమిటో! ఈ వేళ మనస్సులో ఏదో గుబులుగా ఉందండీ! ఓ గంటసేపు దేవ దేవుని ధ్యానించుకుని వద్దామని!"

"నీ మనస్సులో ఉన్న బాధేమిటో చెప్పు, బాబూ?"

"....."

"నీకు తండ్రిలాంటివాడిని! నా దగ్గిర సందేహించకు!"

"మీరింతగా చెప్పాలా, గురువుగారూ! నా బాధ నాకే సరిగ్గా అర్థం కావటం లేదు. మీకేమని చెప్పగలను?"

"పోనీ, నేనుకూడా వస్తాను. పద."

"అబ్బే, మీకు శ్రమ ఎందుకండీ?"

"శ్రమేముంది, బాబూ, దైవదర్శనానికి?"

"వద్దండి! మిమ్మల్నింత రాత్రివేళ అంతదూరం తీసుకువెడితే నా బాధ పెరుగుతుందే కాని, తరగదు, పోనీ, వెళ్ళను లెండి, ఇక్కడే ఉండి...."

"ఆహాఁ! నిన్ను నిరుత్సాహ పరచాలని కాదు.... ఒంటరిగా వెడుతున్నావని...."

"ఏ బాధ్యతలూ లేనప్పుడే కదా దైవధ్యానానికి వీలుపడేది!"

"నువ్వన్నదీ నిజమే! ఈ రాత్రంతా దేవుని ముందు దీపం వెలిగే అవకాశం వచ్చింది. ధన్యుడివి. జాగ్రత్తగా వెళ్ళిరా నాయనా!"

● ● ●

"అంతా వచ్చారా?"

"ఆఁ! మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఇక నీదే ఆలస్యం! పద."

"వద్దు. మీరెవరూ రావద్దు. విగ్రహం నేనే తెచ్చిస్తాను."

"ఒక్కడివీ అంత విగ్రహం మొయ్యగలవా?"

"ఈ పాప భారం కన్న విగ్రహం బరువంటావా?"

"ఏమిటీ చాదస్తం?"

"చాదస్తం కాదు. జాగ్రత్తకోసం! మీరంతా అక్కడ అడుగుపెడితే తెల్లారాక పోలీసు కుక్కలు వెతుక్కుంటూ రాగలవు."

"అదీ పాయింటే! సరే, త్వరగా రా."

గుడి తలుపులు తెరిచాడు అతను. సాయంత్రం అతను వెలిగించిన దీపం కొడిగట్టి పోయింది! కటిక చీకటి అయినా, పరిచితమయిన చోటుకి అతని పాదాలు నడిచాయి. దేవుడు అక్కడే కదలకుండా కూర్చున్నాడు!

ఒక్క నిముషం దేవుణ్ణి ప్రార్థించాడు. 'నా చేత ఈ పని ఎందుకు చేయిస్తున్నావో నీకే తెలియాలి, దేవుడా! నేను నిమిత్త మాత్రుడిని!' అని గొణుక్కున్నాడు అతను. విగ్రహం చుట్టూ చేతులు వేశాడు. వణికే చేతుల్లో సత్తువ సన్నగిల్లింది. విగ్రహం మరింత భారమనిపించింది. ఎలాగో కాళ్ళు నిలదొక్కుకుని ఒక అడుగు వేశాడు. అప్రయత్నంగా అతని చేతుల్నించి జారి ధమ్మమని పడిపోయింది విగ్రహం. తన పాదాల దగ్గర ఏదో గిలగిల కొట్టుకుంటున్నట్టు అయింది. ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడిచింది!

గబుక్కున బొడ్డులో దోపుకున్న అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించాడు.

తల ప్రాణం తోకకి చేరి చివరి శ్వాస విడుస్తున్నది తాచుపాము!

గడగడ వణికిపోయాడతను.

పూర్తిగా మండిన అగ్గిపుల్ల చేతి వేలిని చురుక్కుమనిపించింది! మరో పుల్ల గీశాడు. ఈ మాటు సెమ్మాలో వత్తి వెలిగించాడు. గూట్లో పెట్టిన గిన్నెలోని నూనె కుందిలోకి ఒంపాడు.

గర్భగుడిలో చిక్కని వెలుగులు వ్యాపించాయి.

సెమ్మా నీడలు కింద తారట్లాడుతున్నా, ఆ మాత్రం వెలుగులో విగ్రహం కింద నలిగి చచ్చి పడి ఉన్న పాము స్పష్టంగా కనిపించింది.

ఓ నిముషం పాటు అతనూ ఒక ప్రతిమలాగయిపోయాడు. అతని హృదయంలో సరికొత్త స్పందన బయలుదేరింది.

'విగ్రహం చేయి జారి ఉండకపోతే, తాను పాము మీద అడుగు వేసి ఉండేవాడు! కాని, దేవుడు దయామయుడు. పాముని చంపి తన ప్రాణం కాపాడాడు. అటువంటిది తను దైవ ద్రోహం చెయ్యటమా? తప్పు! డబ్బాశతో ఈ మహాపాపం చెయ్యకూడదు.

అతను ఆ పైన ఆలోచించలేదు. వెంటనే, విగ్రహం మీద చేతులు వేశాడు. అతనికీ మాటు అది బరువనిపించలేదు. ఉద్వేగంతో గుండెలు ఉరకలు వేశాయి. అవలీలగా విగ్రహాన్ని ఎత్తి యథాస్థానాన్ని చేర్చాడు.

పుల్ల ఒకటి తెచ్చి చచ్చిన పాముని ఎత్తి గుడి బయట పారేశాడు.

ప్రహరీ వెనుక నీడలు కదిలాయి.

"గుడిలో దీపం వెలిగించావేమిటి? మతిపోయిందా?" వాళ్ళల్లో ఒకడు అరిచాడు.

"లేదు. నేనువిగ్రహాన్ని మీ కప్పగించేది లేదు. నా మనస్సు మార్చుకున్నాను!" అంటూ

గుడివైపు పరుగెత్తాడతను.

అతనింకా గుడి గడప దాటలేదు. రంయ్‌మంటూ వచ్చి అతని వెన్నులో బాకు దిగపడింది.

గొంతు దాటి రాబోయిన చావు కేకని బలవంతంగా అణుచుకున్నాడు. తూలి చాపచుట్టగా నేల మీద పడిపోయాడు.

ప్రహారీ దాటి వస్తున్న అడుగుల చప్పుడు దగ్గిర అయింది.

గబగబా దేక్కుంటూ ఎలాగో గడప దాటి గుడిలోపలికే చేరుకున్నాడు. వాళ్ళు రాకముందే, ఎక్కడ లేని సత్తువ తెచ్చుకుని లోపల గడియలు పెట్టాడు.

వాళ్ళు తలుపుల బయట ఉన్నారు. బెదిరిస్తున్నారు.

అతని మనస్సు వాళ్ళ మాటల మీద లేదు. మరి వేటి మీదా లేదు.

అతని దృష్టి విగ్రహం మీదనే ఉంది... స్వామిమూర్తి మీదనే ఉంది!

ఒక్కసారిగా గర్భగుడిలో మరింత వెలుగు వ్యాపించింది! ఆ వెలుగు ముందు దీపకాంతి తెలియడంలేదు!

స్వామి ముఖం మీద ఉన్నది దివ్వెకాంతి కాదు! దివ్యకాంతి!

అతను కన్నీటి పొరల్ని చించుకుని స్వామిమూర్తిని పరికించి చూశాడు.

విగ్రహం వట్టి రాతి బొమ్మలా లేదు! ఆ మూర్తిలో అతనికి మందహాసం గోచరించింది.

అతనికి చిత్రమనిపించింది.

"ఎందుకు నవ్వుతున్నావు, స్వామీ?'

స్వామి ఇంకా నవ్వుతూనే ఉన్నాడు... అది హేళన కాదు కదా!

మరణవేదన కన్న.... ఈ బాధ అతని కెక్కువయింది!

"పాముని చంపి నన్ను రక్షించావు. బుద్ధి తెచ్చుకుని పాప కార్యం నుంచి విరమించు కున్నాను. అయినా, నాకిప్పుడు చావు తప్పడం లేదు! ఇదేం న్యాయం, స్వామీ! మంచిగా మారినందుకు ప్రతిఫలం లేదా?" అతని కళ్ళు వర్షిస్తున్నాయి.

ఈ మాటుస్వామి పెదవులు కదిలాయి!

"పిచ్చివాడా! ప్రతిఫలం లేదని ఎందుకనుకుంటున్నావు? ఉంది!"

అతను మరణబాధ కూడా మరిచి ఆశ్చర్యంలో తలమునకలై పోయాడు. అడక్క ముందే అతని సందేహాన్ని తీర్చివేశాడు, చిరు నవ్వులు చిందిస్తున్న స్వామి!

"వాళ్ళ చేతుల్లో నీకు మరణం ఉన్నదని నీ నుదుట విధి ఎప్పుడో వ్రాశాడు! దాన్ని మార్చటం ఎవరి తరం కాదు. దబ్బాశ పెట్టారే కాని, వాళ్ళు విగ్రహం అందిన మరుక్షణంలోనే ప్రాణాలు తీసి ఉండేవాళ్ళు. అందుకనే, అవసాన కాలంలో మంచివైపు మనస్సు మార్చు కోవటానికి నీకో అవకాశం ఇచ్చాను! అదే స్వర్గ, నరకాల కూడలిలో ఉన్న నీ మార్గాన్ని నిర్ణయించింది!"

•